



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

టిడ్కో గృహాలకు అన్ని సౌకర్యాలూ..!

- 2026 మార్చి 31 నాటికి అన్ని గృహాలు పూర్తి - మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ
-10 ఎకరాల్లో పారిశ్రామిక వాడ - పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులోని టిడ్కో గృహాలకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కర్నూలు జగన్నాథగట్టు సమీపంలోని టిడ్కో గృహసముదాయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో 163 టిడ్కో గృహ సముదాయాలు మార్చి 31వ నాటికి లబ్ధిదారులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మంత్రి పి. నారాయణ టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించిన అనంతరం మంత్రి టిజి.భరత్‌లో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014-19 మధ్యకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 7 లక్షల టిడ్కో గృహాలకు అనుమతించగా అందులో 5 లక్షల గృహాలకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ తీసుకొని 4 లక్షల 74 వేల గృహాలకు టెండర్లు పిలిచామని తెలిపారు. ఆ తర్వాత 2019 లో వచ్చిన ప్రభుత్వం దానిని 2 లక్షల 61 వేలు మాత్రం చాలని కుదించింది. సింగపూర్, మలేషియా, జపాన్, చైనా, రష్యా మొదలగు అభివృద్ధి చెందిన దేశాలలో షేర్ వాల్ టెక్నాలజీతో గృహాలు నిర్మాణాలు చేస్తారని అదే టెక్నాలజీని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని ఆలోచించిందన్నారు. భారతదేశంలో ఎక్కడ జరగని నిర్మాణాలతో టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామనితెలిపారు. ఈ గహాలలో “ఏ” గ్రేడ్ వర్టిఫైడ్ టైల్స్, కిచెన్‌లో గ్రానైట్ బండ, అవసరమైన చోట అటకలు, వాల్ పుట్టి, షేర్ వాల్స్ మొదలగు సౌకర్యాలతో గృహ నిర్మాణం చేశామన్నారు. ఇక్కడ ఉన్న కంప చెట్లు జంగిల్ క్లియరెన్స్ రేపటి సాయంకాలంలో గా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి గాను రూ.1కోటి మంజూరు చేశామన్నారు. ఒకటిన్నర నెల లోపల తాగునీరు సౌకర్యం వచ్చేస్తుందని, మిగిలిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం కోసం రూ.5 కోట్ల టిడ్కో ఎండితో సోమవారం మంజూరుచేయిస్తామన్నారు. ఇప్పటివరకు 2064 గృహాలు పూర్తి చేసి సంబంధించిన తాళం లబ్ధిదారులకు అందజేశారన్నారు. 1054 గహాలు ఈ మధ్యనే పూర్తి చేశారని, వీటిని మున్సిపల్ కమిషనర్ కి స్వాధీనపరిచి స్థానిక ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు అందజేసే చర్యలు చేపడతారన్నారు. ఈఏడాది డిసెంబర్ నాటికి 3056 గృహాలను పూర్తి చేస్తారని, మిగిలిన 3826 గృహాలు వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేస్తారని, రాష్ట్రంలోని 163 ప్రదేశాలలో మార్చి 31వ తారీకు నాటికి అన్ని గృహాలు పూర్తి చేసి ప్రజలకు ఇచ్చే దశకు చేరుతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు ఈ గృహ సముదాయానికి ఒక పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. అది జిల్లా కలెక్టర్ ద్వారా ఏర్పాటవుతుందని, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించమని కోరారని, అది కూడా వస్తుందన్నారు. స్థానిక మంత్రి టిజి.భరత్ కోరిక మేరకు ఇక్కడే పది ఎకరాల స్థలాన్ని ఎంఎస్‌ఎంఇ కింద పరిశ్రమల ఏర్పాటు చేయడానికి ఇస్తున్నామని, దీనివలన ఈ కాలనీలో ఉండే వెయ్యి మంది కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. కర్నూలు పట్టణంలో ఆక్రమణలకు గురైన పార్కు స్థలాలను కమిషనర్ వారి ద్వారా ఎంక్వయిరీ చేయించి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, టిడ్కో ఇంజనీర్ డాక్టర్ పెంచలయ్య , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ట్రంప్ చర్యలను వ్యతిరేకించని మోడీ

-పత్తి రైతులకు భారీగా నష్టం -వామపక్ష పార్టీలు నేతలు
-కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న చర్యలను ప్రధానమంత్రి మోడీ వ్యతిరేకించకపోవడం దుర్మార్గమని సిపిఎం, సిపిఐ నేతలు గౌస్ దేశాయ్, మునెప్ప అన్నారు. భారత దేశంలో ట్రంపు విధిస్తున్న సుంకాలవల్ల పత్తి సాగు చేసే రైతులకు భారీగా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. పెంచిన ట్రంప్ టారీఫ్‌లకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ ల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డి.గౌస్ దేశాయి, ఎస్ మునెప్ప మాట్లాడారు. ట్రంప్ భారతదేశంపై వేసిన పన్ను కారణంగా దేశంలో అత్యధికంగా నష్టపోయేది ఆంధ్ర రాష్ట్రమేనన్నారు. 40 శాతం పన్ను విధింపు ద్వారా ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పత్తి పంటపై 11 శాతం ఉన్న దిగుమతి పన్నును ఎత్తివేయడం ద్వారా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పత్తి పంటను అత్యధికంగా పండించే రైతులు కర్నూలు జిల్లాలోనే ఉన్నారన్నారు. అనైతిక పన్ను విధానం ద్వారా దేశాన్ని నష్టపరిచే విధంగా ట్రంప్ ప్రయత్నిస్తూర న్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి పాలకులకే కాక ప్రతిపక్ష జగన్ మోహన్ రెడ్డికి కూడా పట్టడం లేదని విమర్శించారు. నాడు వామపక్షాలు జిఎస్‌టి అన్నది దేశానికి నష్టం చెప్పినా వినకుండా అమలు చేసిన బిజెపి సర్కారు, ఈనాడు దొడ్డి దారిన జిఎస్‌టిని ఎత్తేసే ప్రయత్నం చేయక తప్ప లేదన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ పెద్దన్నగా ఉన్న అమెరికా పన్నుల భారంతో దేశాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవాలనే ఆలోచనకు తెరతీసిందన్నారు. ఇప్పటికైనా ట్రంపు విధానాలను వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, టి.రాముడు, ఎండి ఆనంద్ బాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కూడా మాట్లాడారు.

‘పల్లెకు పోదాం’ సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

‘పల్లెకు పోదాం’ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం కల్లూరు మండలం పర్ల గ్రామంలో ‘పల్లెకు పోదాం’ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా పాల్గొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఒ.హెచ్‌.ఎస్‌ఆర్, అంగన్వాడీ కేంద్రం, ఆస్పత్రి, గ్రామ సచివాలయం, సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కొన్ని సమస్యలను గుర్తించి, పనులను మంజూరు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ, కిచెన్ షెడ్ నిర్మాణాలను మంజూరు చేశారు. గ్రామ సచివాలయం ఎదుట, అంగన్వాడీ కేంద్రం ఎదుట రోడ్లు బాగా లేకపోవడంతో సిమెంట్ రోడ్లు మంజూరు చేశారు. అలాగే సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహం, ఆగిపోయిన భవనాలను పూర్తి చేస్తామని తెలిపారు. పర్ల నుంచి చిన్న టేకూరు, సింగవరం వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డుపై ఉన్న కల్వర్టు బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా మంజూరు చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, కిచెన్ షెడ్, టాయిలెట్స్, నీటి సరఫరాను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచిగా అందించాలని అధికారులను ఆదేశించారు. టాయిలెట్స్‌ను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు కేవలం 5 నెలలు మాత్రమే సమయం ఉందని, బాగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించి, రోజూ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఆదేశించారు. నీటిలో క్లోరిన్ శాతం ఎంత ఉందని కలెక్టర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పరీక్షలు చేయించారు. పరీక్షలు సక్రమంగా చేయలేదని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. క్లోరినేషన్ పరీక్షలకు సంబంధించి టెస్ట్ కిట్ ఎక్స్‌పైర్ అయిన విషయం చెప్పకుండా ఉన్నందుకు, కిట్ తెప్పించుకోకుండా ఏం చేస్తున్నారని, పరీక్షలు చేయకపోతే ప్రజలకు ఏమైనా సమస్య వస్తే ఎలా అని ఇంజినీరింగ్ అసిస్టెంట్ పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రం (విలేజ్ క్లినిక్-2)ను తనిఖీ చేసి సిబ్బంది పని తీరును పరిశీలించారు. క్లినిక్‌లో వైద్యం కోసం వచ్చిన వృద్ధురాలు అక్కమ్మతో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో మంచి వైద్య సేవలందుతున్నా యా, మందులు బాగానే ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తనకు కొద్ది రోజులుగా బీపీ సమస్య ఉందని, మందులు తీసుకోవడానికి ఇక్కడికే వస్తానని, సిబ్బంది చాలా బాగా చూసుకుంటారని ఆమె తెలిపారు. క్లినిక్ సిబ్బంది అందిస్తున్న సేవలపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి హాస్టల్‌లోని స్టోర్ రూమ్, గదులు, వసతి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వారికి అందుతున్న భోజనం, ఆరోగ్య సదుపాయాలు, పాఠశాల హాజరు వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం పత్తి పంటను పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. రైతు మిన్నెల్లాతో మాట్లాడుతూ... ఎన్ని ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు, ఎకరాకు ఎంత ఖర్చు అవుతోంది, పత్తి దిగుబడి ఎలా ఉంది, వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి ఈ-క్రాప్ నమోదు చేశారా అని అడిగి తెలుసుకున్నారు. కల్లూరు ఎంపిడిఒ జిఎన్‌ఎస్.రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.



పర్ల సచివాలయంలో ఇంజినీరింగ్ ఉద్యోగులను మందలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఉల్లిరైతు సమస్య తీరేనా ?

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉల్లి రైతుకు కన్నీరు తప్పడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కర్నూలు ఉల్లి మార్కెట్‌లో ధర మరింత పడిపోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200కు కొంటున్నా రైతుకు నష్టమే వస్తోంది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా ఈ ఏడాది 26,696 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగు చేసేందుకు విత్తనాలకు, రసాయనిక ఎరువులకు, సేద్యానికి రూ.4 వేలు, కలుపు తీయడానికి, క్రిమిసంహారక మందులకు, కోతలకు కలిపి రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. మొన్నటి వరకూ వర్షాలు కురవడం ప్రస్తుతం తెరపి ఇవ్వడంతో మళ్లీ వర్షాలు కురిస్తే ఉల్లి కుళ్లిపోతుందన్న అనుమానంతో రైతులు ఉల్లి కోతలపై దష్టి పెట్టారు. గతేడాది ఆగస్టులో 17,102 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు రాగా ఈ ఏడాది ఆగస్టులో 40,785 క్వింటాళ్ల పంట వచ్చింది. గతేడాది గరిష్టంగా క్వింటాకు రూ.3989 రాగా ఈ ఏడాది గరిష్టంగా రూ.1599 మాత్రమే వచ్చింది. గతేడాది కనిష్టంగా క్వింటాకు రూ.679 రాగా ఈ ఏడాది కనిష్ట ధర రూ.501కి పడిపోయింది. ఉల్లి రైతులకు ధర దక్కకపోవడంతో తీవ్రంగా నష్టాల పాలవుతున్నారని, కర్నూలు మార్కెట్‌కు సరుకు తెచ్చినా ధర లేక బయట తక్కువ ధరకు అమ్ముకుని వెళ్లిపోతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ముఖ్యమంత్రి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ఆ ఆదేశాల మేరకు సోమవారం పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ కర్నూలు మార్కెట్ యార్డ్‌లో ఉల్లి కొనుగోళ్లను ప్రారంభించారు. సెప్టెంబర్ నెల మొత్తం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. సాధారణంగా ఎకరాకు 70 క్వింటాళ్ల ఉల్లి దిగుబడి వస్తుంది. క్వింటా రూ.1200 లెక్కన కొంటే రైతుకు రూ.84 వేలు దక్కుతుంది. అంటే పెట్టుబడి కంటే రైతుకు రూ.66వేల నష్టం వస్తుంది. సెప్టెంబర్ మధ్యలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ఆపేసినా, అక్టోబర్‌లో కొనుగోలు చేయకపోయినా రైతుకు నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. మెత్తబడిన, తడిసిన, కుళ్లిన ఉల్లిని వేరు చేస్తే ఆ ఉల్లి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారు. రైతులు తమ ఆధార్ కార్డును, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఈపాస్ రిసిప్ట్ అధికారులకు ఇస్తే పంటను ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు రిసిప్ట్ ఇస్తారు. వారం రోజుల్లో ఆ డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. సకాలంలో ప్రభుత్వం రైతులకు డబ్బులు జమ చేయకపోతే ధాన్యం బకాయిల లాగా ఉల్లి బకాయిలు కూడా మిగిలిపోయే అవకాశం ఉంది.

సీజనల్ వ్యాధుల విజృంభణ : మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరం, నిమోనియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా, డయేరియా కేసులు పెరిగాయి. ఈ కేసులతో ఆస్పత్రులు, క్లినిక్స్ నిండిపోతున్నాయి. జిజిహెచ్ పిల్లల విభాగం ఒపిలో సాధారణ సమయంలో 150 నుంచి 200 ఒపిలు ఉంటే ప్రస్తుతం 250 నుంచి 300 దాకా పెరిగాయి. జనరల్ మెడిసిన్ విభాగంలో 300 ఒపిలలో సీజనల్ కేసులు 50 నుంచి 60 దాకా ఉన్నాయి. ప్రయివేట్ ఆస్పత్రులు, క్లినిక్స్‌లో వైరల్ ఫీవర్ రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది.

అవీ..ఇవీ..అన్నీ.. : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా సాగింది.



సిల్వర్ జూబ్లీ అధ్యాపకురాలికి రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ విశ్వ విద్యాలయం సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.అనూష ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పూరస్కరం అందుకున్నారు. ఈమె 2011 డిగ్రీ లెక్చరర్ గా ఎంపికయింది. మొదటగా ఎన్‌పిఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఉమెన్స్ చిత్తూరులో తన కెరీర్‌ను ప్రారంభించింది. 2015 వరకు అక్కడ పనిచేసింది. అక్కడి నుండి కర్నూలు కెవిఆర్ డిగ్రీ కళాశాలకు 2021 వరకు పనిచేసింది. ప్రస్తుతం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో పనిచేస్తూ బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికయింది. డాక్టర్ బి.అనూష బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ విసి ఆచార్య వి. వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్, సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, క్లస్టర్ యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజ్ శెట్టి, భర్త యువి సుబ్బారెడ్డి, కెమిస్ట్రీ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మొదటి నంది అవార్డు గ్రహీత కన్నుమూత

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



నంది అవార్డు పోటీల్లో అప్పటి 1998లో నర నారాయణ నాటకం టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఇందులో మొదటి నంది అవార్డు అందు కున్న వి.బలరాం శుక్రవారం రాత్రి అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన ఓ మనిషి నీకు జోహార్లు అనే సాంఘిక నాటకంలో ఉత్తమ హాస్యనటుడిగా 2013లో నంది అవార్డు తీసుకున్నారు. రెండు నంది అవార్డులు తీసుకున్న బలరాం నరనారాయణ, మహారధి, కర్ణ, ఓ మనిషి నీకు జోహార్లు, పుటుక్కు జరజర డుబుక్కుమే, ప్రియాంక, పులిస్వారి తదితర నాటకాల్లో నటించారు. కళాక్షేత్రంలో కార్యవర్గ సభ్యునిగా బృంద నాయకునిగా దర్శకునిగా విశిష్ట సేవలు అందించారు. ఆయన వయస్సు 70 సంవత్సరాలు ఆకస్మిక మృతి పట్ల టీజీవి కళాక్షేత్రం నిర్వహకులు సంతాపం ప్రకటిస్తూ ఆయనకు కళాకారులు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేటి పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతి కళ కోడుమూరు మండల రెవెన్యూ ఆఫీసర్ కె.నాగరాజుతో కలిసి లద్దగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ ను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును హెల్త్ వెల్నెస్ సెంటర్ అంగన్వాడి సెంటర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజలతో నేరుగా కలిసి వారి సమస్యలను విని పరిష్కరించే విధంగా గ్రామ అభివృద్ధిని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జయంతి, సిహెచ్‌ఒ శాంత ,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ యాదవ్, వైద్య సిబ్బంది హాజరయ్యారు.

కుడా నిధులతో 100 సిసిటివి కెమెరాలు

రాష్ట్ర మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కుడా నిధులు రూ.29.84 లక్షలతో కర్నూలు నగరంలో 100 సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టిజి. భరత్ పేర్కొన్నారు. స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్‌లో కర్నూలు నగరంలో 100 సిసిటివి కెమెరాలు ఏర్పాటుకు సంబంధించి కుడా నిధులు రూ.29.84 లక్షల చెక్‌ను మంత్రి భరత్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఎస్‌పి విక్రాంత్‌పాటిల్‌కు అందించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని ప్రోత్సహిస్తూ ఉంటారని తెలిపారు. వారి ఆశయాల మేరకు జిల్లాలో కర్నూలు నగరంలో ఎఐ టెక్నాలజీతో కూడిన 100 సిసి టీవీ కెమెరాలను కూడా నిధులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇదివరకే నగరంలో 150 సిసిటివిలను మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ అధునాతన సిసిటివి కెమెరాల ద్వారా నగరంలో నేరాల నియంత్రణకు వీలవుతుందని, క్రిమినల్స్ తప్పించుకోలేరని మంత్రి తెలిపారు. సిసిటివి కెమెరాలకు రూ.30 లక్షల నిధులు మంజూరు చేసిన కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు నగరం శాంతి భద్రతలతో ప్రశాంతంగా ఉండేందుకు, నేరాల నియంత్రణకు తోడ్పడాలన్న లక్ష్యంతో కుడా నిధులు మంజూరు చేశామని తెలిపారు.కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ రహదారి భద్రతలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా నగరంలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు నగరంలో ఏడుకోట్లతో రోడ్ల నిర్మాణం, సుందరీకరణ పనులను చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నగరంలో 250 కెమెరాలతో నియంత్రణకు వీలుగా పకడ్బందీ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు ఇన్విజిబుల్ పోలీస్ - విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇస్తున్నామని అందులో భాగంగానే సాఫ్ట్వేర్ తో కూడిన 100 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ కర్నూలు నగరంలో సర్వేలెన్సు, శాంతిభద్రతలు మరింత మెరుగుపడేందుకు వీలుగా కుడా నిధులతో 100 సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కుడా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సిసిటివి కెమెరాల కోసం ఎస్‌పి చెక్కును అందజేస్తు మంత్రి భరత్ , సోమిశెట్టి

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- వెల్దుర్తి



వ్యవసాయం గిట్టుబాటు కాక, కుటుంబ ఖర్చులు భరించలేక, అప్పులు తీర్చలేక గతంలో ఆత్మహత్యకు యత్నించి కోలుకున్న రైతు రెండో సారి ఆత్మహత్యాయత్నం చేసి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఎస్ పేరేముల గ్రామానికి చెందిన రైతు ముంత మద్దిలేటి(50) తన భార్య లలితమ్మ పేరున గల 2 ఎకరాలు, కౌలుకు తీసుకున్న 6 ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా ఒక కుమార్తెకు పెళ్లి చేశాడు. వ్యవసాయంపై నమ్మకంతో సాగుకు, కుటుంబ ఖర్చులకు అప్పులు చేశాడు. క్రాఫ్‌లోనుతో కలిపి రూ.6లక్షలయ్యాయి. గతేడాది పత్తి, ఆముదాలు వేసి దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. కుటుంబ ఖర్చులు భరించలేక, తిరిగి వ్యవసాయానికి పెట్టుబడి దొరికే మార్గం లేక. అయిన అప్పులు తీర్చేదారి కానరాక 4నెలల క్రితం పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఇంటికి వచ్చి తిరిగి ఎలాగోలాగా అప్పులు చేసి 8ఎకరాలలో కందిసాగు చేశాడు. ఈ సారి కూడా దిగుబడులు రాని పరిస్థితి. అప్పుల వారి ఒత్తిడి పెరిగిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లిన తరువాత శుక్రవారం రాత్రి ఇంట్లో దూలానికి తాడుతో ఉరి వేసుకున్నాడు. శనివారం ఉదయం చూసిన వారు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.



నవలను ఆవిష్కరిస్తున్న మోషన్ కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ అంజాద్

పర్యావరణ పరిరక్షణ నవల ఆవిష్కరణ

పజాశక్తి-కర్నూలు కల్చరల్

కర్నూలు బిర్లా కాంపౌండ్ లోని మోషన్ జూనియర్ కళాశాల బొటనీ అధ్యాపకులు డాక్టర్ స్వరూప్ సిన్హా పర్యావరణ పరిరక్షణ అంశంగా రాసిన ఆంగ్ల నవల ఎ మరాల్డ్ సేవియర్స్ ను నేడు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ అంజద్ ఖాన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణకు ప్రతి విద్యార్థి అంకితమవ్వాలని, సిన్హా ఎన్నుకున్న అంశం నేడు ప్రపంచ దేశాల మధ్య చర్చించి పరిష్కార దిశగా పయనిస్తున్నదన్నారు. చక్కటి యితివృత్తంతో బాల బాలికలు యీ పచ్చ దనాన్ని రక్షించే ముందు తరాల దూతలని డాక్టర్ సిన్హాను అభినందించి శుభాకాంక్షలు అందజేశారు. పిల్లలకు అర్థ మయ్యే సరళమైన ఆంగ్లంలో రాసిన అధ్యాపకుడిని అభినందించారు. గతంలో కూడా ఆయన అనేక పుస్తకాలను రచించారని, భవిష్యత్తులో కూడా వారినుంచి ఇటువంటి మరిన్ని మంచి పుస్తకాలు రావాలన్నారు.



చిన్నపిల్లలకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ విభాగంలో శనివారం నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు టీకా వేయడం ద్వారా వ్యాధులను సమర్ధవంతంగా నివారించవచ్చని తెలిపారు. టీకాలు శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి వ్యాధుల బారిన పడకుండా కాపాడుతాయని, పిల్లలకు అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పించడానికి భారత ప్రభుత్వం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నదని తెలిపారు. టీకాలు వేయించుకోవడం సురక్షితం , ప్రభావవంతమైందని తెలిపారు. వేలకు వేలు అనవసరంగా డబ్బులు ఖర్చు పెట్టుకోవలసిన అవసరం లేదని అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. టీకాల కార్యక్రమాన్ని గర్భవతులు చిన్నపిల్లలు తప్పనిసరిగా వినియోగించుకున్నట్లు చూడాలని సిబ్బందికి సూచించారు. నూరు శాతం పిల్లలు టీకాలు వేయించుకునేట్లు నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే టీకాల తప్పనిసరి అని తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకురాలు నాగిబాయి, ఆరోగ్య సిబ్బంది ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రవీంద్ర విద్యాసంస్థల్లో టీచర్స్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని పురస్కరించుకొని రవీంద్ర విద్యా సంస్థల్లో గురుపూజోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి. పుల్లయ్య , అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, వైస్ చైర్మన్ జి. వంశీధర్ పాల్గొన్నారు. జి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల మేథోమదనానికి కృషి సల్పుతూ భావి జీవితానికి బాటలు వేయాలన్నారు. భారతావని అభివృద్ధికి కంకణ బద్దులను చేయాలన్నారు. డాక్టర్ మమతా మోహన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో కూడా ఎంతోగొప్ప మేధస్సు ఉందన్నారు. ఆ మేధస్సును సద్వినియోగ పరిచేలా చేయగలడమే ఉపాధ్యాయుని ముఖ్య లక్షణమన్నారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జి. నాగన్న, కె. గీతారాణి, ఏ. శిరీష, ఎం.లలితా కుమారి ఘనంగా సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.పుల్లయ్య


ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు

సోషల్ ఆడిట్‌లో బయటపడిన అక్రమాలు

- రికవరీకి అడిషనల్ పీడీ ఆదేశాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ చట్టంలో మండలంలోని 13 పంచాయతీల్లో జరిగిన అవకతవకల్లో రూ.1,93,484 రికవరీ చేసేందుకు జిల్లా అడిషనల్ పీడీ మాధవి లత ఆదేశించారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అల్లా బకాష్ అధ్యక్షతన ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ చట్టం ఆడిటింగ్‌లో భాగంగా అడిషనల్ పీడీ మాధవి లత బహిరంగ విచారణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ... 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని, గత రెండు వారాల నుంచి పనులను పరిశీలించి ఉపాధి కూలీలతో గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. 13 పంచాయతీల్లో బంటనహాల్, నగరడోనా, రామదుర్గం, నంచర్ల, డేగలహాల్ గ్రామాల్లో ఎటువంటి అక్రమాలూ జరగలేదని, మిగిలిన 8 పంచాయతీల్లో సుమారు రూ.1,93,484 అక్రమాలు జరిగినట్లు చెప్పారు. 12 గ్రామాలకు పెనాల్టీ రూ.27,500 విధించినట్లు వివరించారు. ఏపీడీ పకీరప్ప, డిఇఒ లోకేశ్వర్, ఎస్‌టిఎం మల్లికార్జున రెడ్డి, ఎస్ఆర్‌పి కాంతయ్య, పిఆర్ ఎఇ సోమప్ప, ఏపీవో మాధవ శంకర్, డేగలహాల్ సర్పంచి నీలకంఠ, టెక్నికల్ అసిస్టెంట్ మారుతి పాల్గొన్నారు.

నానో యూరియాతో ప్రయోజనాలు

- జెడిఎ వరలక్ష్మి


రైతులకు వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

రైతులందరూ యూరియాను పైపాటుగా వేసే బదులు నానో యూరియా వాడడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని జెడిఎ వరలక్ష్మి తెలిపారు. శనివారం గోనెగండ్ల లో వివిధ ఎరువుల దుకాణాలను పరిశీలించి నానో యూరియా వాడకంపై రైతులకు వివరించారు. యూరియాలో 16 శాతం నత్రజని ఉంటుందని, నానో యూరియా పిచికారి చేస్తే అది నేరుగా ఆకుల ద్వారా మొక్కకు చేరి నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. మామూలు యూరియా వాడితే కేవలం 30 నుంచి 35 శాతం మాత్రమే ఉపయోగపడుతుందని, మిగతా మొత్తం ఆవిరి కావడం నీటిలో కొట్టుకు పోవడం జరుగుతుందని చెప్పారు. రైతులు కూడా నానో యూరియా పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. యూరియా కూడా అందరికీ అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని, యూరియా రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తామని చెప్పారు. ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత, విస్తరణాధికారి పులి రాజు, కోరమండల్ ప్రతినిధి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్వేపల్లి ఆదర్శం

- ఎఫ్ఆర్ హైస్కూల్‌లో గురుపూజోత్సవం


ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- దేవనకొండ

నేటి విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఉచ్చీరప్ప, కరస్పాండెంట్ రఘునాథ్ కోరారు. శనివారం దేవనకొండ ఎఫ్ఆర్ హైస్కూల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... నేటి సమాజంలో సర్వేపల్లి రాధాకృష్ణ, అబ్దుల్ కలాం జీవిత అనుభవ గ్రంథాలను చదివి విద్యార్థులు ఆదర్శవంతంగా ఉండాలని తెలిపారు. ఎఫ్ఆర్ స్కూల్‌లో పనిచేస్తున్న 30 మంది ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు గోపాల్, షబానా, శ్రావణి, లక్ష్మి, స్రవంతి, రంగస్వామి, హేమలత, ఉషారాణి, ఎస్ఎమ్‌డి.బాష, పరమేష్, చంద్రకళ, భవాని, ఉమా, లక్ష్మి, శాంతి, మహేశ్వరి, జాహిద, భారతి, నాగవేణి, బద్రున్నీసా, శాంతి పాల్గొన్నారు.

దేశ ప్రజల ప్రయోజనాల కంటే

అమెరికా ప్రయోజనాలపైనే కేంద్రానికి ఆసక్తి

- వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశ ప్రజల ప్రయోజనాల కంటే అమెరికా ప్రయోజనాలపైనే కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని వామపక్ష నాయకులు మండిపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా శనివారం వామపక్షాల రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆందోళన, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గోవిందు, పంపన్న గౌడ్, రాజు మాట్లాడారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతం పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్



ఎమ్మిగనూరులో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయని తెలిపారు. రాష్ట్రంలో రొయ్యల ధరలు ఘోరంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతున్నారని చెప్పారు. గార్మెంట్స్ మిల్లులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వేలాది మహిళా కార్మికుల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. భారతదేశ వాణిజ్య ఎగుమతి, దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల టారిఫ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రష్యా, చైనాలతో వాణిజ్య ఒప్పందాలను పెంపొందించుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు రుద్రరాజు మాట్లాడుతూ... ప్రధాని మోడీ దొంగ ఓట్లతో గద్దెనెక్కారని విమర్శించారు. వామపక్ష నాయకులు రాజీవ్, గిడ్డయ్య, ప్రసాద్, మద్దిలేటి, లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, సమీవుల్లా, తిమ్మగురుడు, సురేష్, సోమేశ్వర్ రెడ్డి, విరుపాక్షి నాయుడు, ఖాజా, నరసింహులు, మల్లికార్జున గౌడ్, రమేష్, నాగరాజు, రాఘవేంద్ర, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆస్పరి : భారతీయ సరుకుల దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం సుంకాన్ని పెంచడం అన్యాయమని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి మండిపడ్డారు. సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, రైతు సంఘం మండల కార్యదర్శి రంగన్న పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వడ్డే నరసింహరాజును పలువురు అభినందించి సన్మానం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత


మంత్రాలయంలో...

పాఠశాల ఆవరణలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అనురాధ, ఎంపిడిఒ నూర్జహాన్, ఎంఇఒలు మోయినుద్దీన్, రాఘన్న, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, వడ్డెర సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షులు వడ్డే నారాయణ, అధ్యక్షులు వడ్డే మాధవ్, కార్యదర్శి కప్పన్నలు అభినందించారు. శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. **ఆదోని** మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ఉపాధ్యాయులు పూలమాల, శాలువా వేసి సునీల్ రాజ్ కుమార్‌ను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన సునీల్ రాజ్ కుమార్ మరింతగా రాణించాలని ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్ ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, నాగేష్, ప్రతాప్ రెడ్డి, మల్లికార్జున, బసవరాజు ఉన్నారు.


ఆదోని సునీల్ రాజ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


జిల్లా పరిషత్ హై స్కూల్‌కు ఏర్పాటు చేస్తున్న పైపు లైన్

రామకృష్ణకు సముచిత స్థానం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ


రామకృష్ణ సన్మానిస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

ఎపి హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా నియామకమైన ఆరెకల్ రామకృష్ణ సేవలను అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం వారి గృహంలో రామకృష్ణ దంపతులకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన వారి సేవలను అధిష్టానం గుర్తిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నాగరాజు, మురళీ, మాధవ్ ఉన్నారు.

'పని భారం పెంచారు'

ప్రజాశక్తి - ఆదోని

వాలంటీర్లు చేయాల్సిన పనులు, సర్వేలను తమతో చేయిస్తూ పని భారం పెంచారని సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ జెఎసి నాయకులు మండిపడ్డారు. శనివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి సచివాలయ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జెఎసి నాయకులు చంద్రశేఖర్, వీర, ప్రభాకర్, ఇందు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేసిందన్నారు. గతంలో వాలంటీర్లు చేసే విధులను తమతో చేయిస్తూ పని భారం పెంచి, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయా రు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగులు రవికుమార్, ఆనంద్, బాల నాయక్, శాంతి ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కోసిగి

స్థానిక మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు పిఎఫ్, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు కోరారు. శనివారం డిపిఒ జి.భాస్కర్‌కు సిఐటియు మండల కమిటీ కన్వీనర్ రాముడు, వీరేష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మేజర్ పంచాయతీ కార్యాలయంలో 38 మంది కార్మికులు 15 ఏళ్లకుపైగా పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులకు పిఎఫ్, ఇన్స్యూరెన్స్ సౌకర్యం లేదని చెప్పారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీఇచ్చారు.

అనంత పద్మనాభ స్వామి జయంతి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు అనంత పద్మనాభ స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్థానిక శ్రీమఠం లోని పూజా మందిరంలో స్వర్ణ పీఠంపై రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములతో పాటు అనంత పద్మనాభ స్వామికి మంగళ హారతులు ఇచ్చారు. పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూజలు చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో పెరిగిన భక్తుల రద్దీ

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో రద్దీ పెరిగింది. దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వరుస క్రమంలో దర్శన భాగ్యం కల్పించారు. అన్నదానం చేసిన భక్తు లకు సేవాదారులతో పాటు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు.

కెజిబివి సమస్య పరిష్కారం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - నందవరం

కెజిబివి సమస్య పరిష్కారమైంది. శనివారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'మాకు న్యాయం చేయండి' కథనానికి అధికారులు స్పందించారు. పాఠశాలకు వచ్చే నీటి పైపులైన్ ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కనెక్షన్ ఇవ్వాలని మండల అధికారులు ప్రయత్నించారు. కెజిబివి సిబ్బందికి తెలియకుండా.. వారికి తాగినీటి సమస్యను సృష్టించే విధంగా అధికారులు ప్రయత్నించారు. ఈ విషయాన్ని గమనించిన ప్రిన్సిపల్, విద్యా కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పాఠశాలకు అధికారులు అన్యాయం చేయడానికి పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను తెలియజేస్తూ తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కోరారు. ఉన్నతాధికారులు స్పందించి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. వారి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెజిబివి దగ్గర కాకుండా గ్రామంలోకి వెళ్లే మెయిన్ లైన్‌కు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో కెజిబివి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్యాలయంలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రమాదం తప్పింది. కార్యాలయంలోని ఫస్ట్ ఫ్లోర్‌లో మెట్లపై పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. శబ్దం రావడంతో ఉద్యోగులంతా ఉలిక్కిపడ్డారు. ఘటన సమయంలో ఎవరూ మెట్ల మీదుగా రాకపోవడంతో ప్రమాదం తప్పిందని ఉద్యోగులు తెలిపారు. 2007లో మున్సిపల్ కార్యాలయం నిర్మించారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కార్యాలయ సముదాయాన్ని


పెచ్చులూడి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రారంభించారు. 17 ఏళ్లు కూడా నిలవకుండా పెచ్చులూడిపోవడం చూస్తుంటే నాణ్యత లేదన్నది తెలుస్తోంది. నిత్యం ఉద్యోగులు, సందర్శకులతో రద్దీగా ఉండే మున్సిపల్ కార్యాలయంలో ఆ ఘటన జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదయూ జరగలేదు. జనంపై పెచ్చులూడి పడి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించలేం. పెచ్చులూడి పడతాయన్న విషయాన్ని కూడా అధికారులు గుర్తించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఇవ్వకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. పట్టణ శివారులోని పర్వతాపురం కాలనీలో మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ సందీప్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు దోమల వల్ల వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఇంటి ఆవరణలో చెత్తాచెదారం వేయకుండా పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలియజేయాలని హెల్త్ ఉద్యోగులకు సూచించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, పులికొండ, శానిటేషన్ సెక్రటరీ బ్రహ్మయ్య ఉన్నారు.


సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

పశువులతో పోల్చిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని నియోజకవర్గం నుంచి వలసలు వెళ్లిన ప్రజలను పశువులతో పోల్చిన ఎమ్మెల్యే పార్థసారథి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆదోని జిల్లా సాధన ఐక్య వేదిక కన్వీనర్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. పెద్దహరివాణం గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బ తినేలా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడడం తగదన్నారు. ఉపాధి కోసం వలస వెళ్తున్న ఆదోని ప్రజలకు ఇక్కడ పనులు కల్పించకుండా.. పశువుల్లాగా వెళ్తున్నారని అవమానించడం దారుణమన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న నాసరరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి ఆదేశించారు. శనివారం 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కార్యాలయాలను తనిఖీ చేశారు. గ్రామంలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆస్పత్రి, పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేసి పరిశీలించారు. కార్యాలయ సిబ్బందితో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న కేంద్రాలకు చాలావరకు సొంత రూములు లేవని, ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని సూపర్‌వైజర్ కోరారు. మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లోనూ జిల్లా స్థాయి ఉన్నతాధికారులు 'పల్లెకు పోదాం' నిర్వహించారు. మాచాపురం సచివాలయంలో పి.కొండయ్య తనిఖీ చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించి మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు.

వైసిపి పాలనలో నిలిచిన అభివృద్ధి : మాధవరావు దేశాయ్

వైసిపి పాలనలో అభివృద్ధి నిలిచిపోయిందని టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. నందవరం గ్రామాన్ని సందర్శించిన జడ్‌పి సిఇఒ నాసర రెడ్డికి గ్రామంలోని సమస్యలపైన ఆయన ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ... ఎన్‌టిఆర్ కాలనీ ప్రజలకు తాగునీరందించాలని గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు బోరు వేయించినట్లు తెలిపారు. బోరులో మూడు ఇంచుల నీరు పడ్డాయని, మోటార్ అమర్చి ఇంటింటికీ తాగునీరందించే సమయంలో వైసిపి ప్రభుత్వం కొలువుదీరిందని చెప్పారు. వారి నిర్లక్ష్యంతో బోరు నిర్వీర్యంగా ఉందని తెలిపారు. వాటి మరమ్మతులను చేపట్టి ప్రజలకు నీరందేలా చూడాలని కోరారు. అనంతరం దుర్భరంగా మారిన పార్కును చూపించారు. దాని అభివృద్ధికి సహకరించాలని తెలిపారు. గ్రామ, మండల ప్రజలు కూరగాయలు కొనుక్కోవడానికి, విక్రయించడానికి గతంలో టిడిపి హయాంలో బీవీ.జయ నాగేశ్వరరెడ్డి సహకారంతో రూ.9 లక్షలతో విలేజ్ మార్కెట్


హాలహర్విలో డిఇఒ

నిర్మించామని, అదీ చివరి దశలో నిలిచిపోయిందని తెలిపారు. మార్కెట్ సదుపాయం లేక కూరగాయలు విక్రయించే వ్యక్తులు రోడ్లపై పెట్టి అమ్మకాలను నిర్వహిస్తున్నారని, శనివారం సంత జరిగే సమయంలో ప్రజల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు ఖాసీంవలీ, సొసైటీ ఛైర్మన్ ధర్మపురం గోపాల్, జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప, చిన్న రాముడు, సత్యరెడ్డి, ఎంపిడిఒ పుల్లయ్య, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎఒ కృష్ణమూర్తి, ఏపీవో శ్రీనివాసులు, హౌసింగ్ ఎఇ వెంకటేష్, విఆర్ఒ రామేశ్వరమ్మ, చాకలి శ్రీనివాసులు, రియాజ్ పాల్గొన్నారు.

హాలహర్వి మండలం సిద్ధాపురం, బల్లూరు, అమృతాపురం గ్రామాల్లో డిఇఒ శ్యామూల్ పాల్ పర్యటించారు. సిద్ధాపురం గ్రామంలో ఎంపిపి పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంఇఒ-1 ఈరన్న, తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మంచిగా అందించాలని తెలిపారు. ఎంపిడిఒ గాదిలింగ పాల్గొన్నారు. అలాగే బల్లూరు గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు, ఎంఇఒ-2 శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఏపీవో చక్రవర్తి, ఎంపిపి స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే అమృతాపురం గ్రామంలో ప్రత్యేకాధికారి మధుసూదన్ రెడ్డి పర్యటించారు. **ఆలూరు** మండలం స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ టి.అజయ్ కుమార్ బృందం ఆలూరులోని మెయిన్ స్కూల్, బాయ్స్-1, 2, బాలికల ఉన్నత పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి, మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 4వ వార్డు ఎంపిపి స్కూల్‌లో పెచ్చులూడిన ఘటనపై ఆరా తీశారు. కెజిబివి పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి, వంట గదులను, ఆర్ఒ ప్లాంట్ ను తనిఖీ చేసి బాగున్నాయని ఎస్ఒ సుహాసిని అభినందించారు. ఎంఇఒలు కోమలదేవి, చిరంజీవి రెడ్డి, ఎంపిడిఒ బాలస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ రామ్ లీలా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

కోసిగి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పాఠశాలలు, హాస్టల్, జగనన్న కాలనీలను డిపిఒ భాస్కర్ తనిఖీ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు, పారిశుధ్య లోపం, తాగునీరు వంటి సమస్యలపై తనిఖీ చేశారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి, ఎంఇఒ శ్రీనివాసులు, పిఆర్ ఎఇ మాలిక్, ఏపీవో ఖాలిక్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు ముత్తురెడ్డి, జక్కనగేని వెంకటేశ్వర్లు, మాణిక్ రాజ్, రాజేష్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలం గోనెగండ్ల, అలువాల, పెద్దమరివీడు గ్రామాల్లో జిల్లా అధికారులు 'పల్లెకు పోదాం' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, జెడిఎ వరలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిడి శ్రీదేవి, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ పర్యటించారు. గోనెగండ్ల బీసీ బాలికల వసతి గృహంలో గదుల కొరత ఉందని విద్యార్థి సంఘాల నాయకులు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. తహశీల్దార్ పి.రాజేశ్వరి, ఎంపిడిఒ మణిమంజరి, డిప్యూటీ ఎంపిడిఒ అనంతశయన, సర్పంచి హైమావతి, పంచాయితీ కార్యదర్శి సతీష్, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ, ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, హౌసింగ్ ఎఇ షేక్షావలీ, ఏపీవో మహ్మద్ బాష, హాస్టల్ వార్డెన్ శిరీష పాల్గొన్నారు.

ఆస్పరిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచి రాధమ్మ, గ్రామస్తులు కోరారు. 'పల్లెకు పోదాం'లో భాగంగా ఆస్పరిలో హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్‌సి పాండురంగా రావు, డి.కోటకొండ గ్రామాల్లో స్పెషల్ ఆర్అండ్‌బి ఎస్‌సి మహేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఆస్పరికి 15 నుంచి 25 రోజులకోసారి నాగనాథన హళ్లి రిజర్వాయర్ నుంచి నీరు వస్తున్నాయని, ఆస్పరికి రావాల్సిన నీరు ఆదోని మండలంలోని ఐదు గ్రామాలకు అక్రమంగా కనెక్షన్లు తీసుకున్నారని, ఆ గ్రామాల కనెక్షన్లు తొలగిస్తే ఆస్పరికి నీటి సమస్య ఉండదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పందికోన రిజర్వాయర్ నుంచి ఆస్పరికి పైపులైన్ వేయాలని కోరారు. స్పందించిన ఎస్‌సి... నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హనుమంతును ఆదేశించారు. అనంతరం జడ్‌పిహెచ్ పాఠశాల, ప్రభుత్వాస్పత్రి, అంగన్వాడీ కేంద్రం, బాలికల వసతి గృహం, జగనన్న కాలనీలోని లే అవుట్లను పరిశీలించి, ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. ఎంపిడిఒ గీతావాణి, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, ఏపీవో రామకృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, ఎఎస్ఒ రామాంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ రంగస్వామి, అంగన్వాడీ సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, కెడిసిసి బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర పాల్గొన్నారు. డి.కోటకొండలో డిప్యూటీ ఎంపిడిఒ విజయభాను, సర్పంచి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు సురేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.

చిప్పగిరి మండలం రామదుర్గం, నగరడోనా, తిమ్మాపురం గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ రఘునాథ్ బాబు, సిపిఒ జి.భారతిలు 'పల్లెకు పోదాం' నిర్వహించారు. ఎంపిడిఒ అల్లాబకాష్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, సిసింద్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరడోనా, రామదుర్గం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, నిర్మాణంలో ఉన్న గృహాలు, పశు వైద్యశాలలు, ఉపాధి హామీ పనులను తనిఖీ చేసి అటెండెన్స్ రికార్డులను, అంగన్వాడీ కేంద్రాల్లో స్టాక్ రికార్డులను పరిశీలించారు. వీధుల్లో పారిశుధ్య పనులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నగరడోనా గ్రామంలో సాగునీటి సంఘం అధ్యక్షులు కిష్టప్ప, సర్పంచి మల్లమ్మ మాట్లాడుతూ... గ్రామంలో విద్యార్థులకు అదనపు తరగతి గదులు నిర్మించాలని, స్థలం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. నిధులు మంజూరు చేయాలని, నగరడోనాలోని 1వ అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని కోరారు. రామదుర్గం సర్పంచి రోహిణి, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఎంఇఒ సావిత్రమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి, నరసింహులు, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి, వెలుగు సిసి శ్రీనివాసులు, ఈరప్ప, నాగేంద్ర, అంజి పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం తెర్నేకల్ గ్రామంలో 'పల్లెకు పోదాం'లో భాగంగా మండల ప్రత్యేకాధికారి జి.లక్ష్మి నారాయణ, ఎంపిడిఒ జ్యోతి, సర్పంచి మోగతాల్ అరుణ్ కుమార్, ఎంపిపి భర్త లుముంబా పర్యటించారు. పాఠశాలలో 1,650 మంది విద్యార్థులు ఉన్నారని, వంట గది లేదని, పాఠశాలకు ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు స్పెషల్ ఆఫీసర్‌ను కోరారు. చెత్త సంపద కేంద్రం దగ్గర ఎలక్ట్రిసిటీ, బోరు వేయించాలని, గత 8 నెలల నుంచి జీతాల్లేక పారిశుధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచి అరుణ్ కుమార్ తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, విద్యా కమిటీ ఛైర్మన్ వీరేష్ పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మంచాల, వగరూరు, నారాయణపురం గ్రామాలను జిల్లా రవాణా శాఖ కమిషనర్ శాంత కుమారి, ఆర్‌టిఒ భరత్, తహశీల్దార్ కె.రమాదేవి, ఎంపిడిఒ నూర్జహాన్, ఆర్ఐ జనార్దన్ రావు సందర్శించారు. రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, తాగునీరు తదితర సమస్యల గురించి ఆరా తీశారు.


దేవనకొండలో మాట్లాడుతున్న అధికారులు


సిఇఒకు సమస్యలను వివరిస్తున్నన మాధవరావు దేశాయ్


ఆలూరులో...


కోసిగిలో మాట్లాడుతున్న డిపిఒ


ఆస్పరిలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పాండురంగారావు

ఆటో కార్మికులకు ఉపాధి చూపాలి

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం తీసుకురావడంతో ఆటో కార్మికులు అత్యధిక సంఖ్యలో ఉపాధి కోల్పోయారని, సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర అన్నారు. శనివారం పత్తికొండ పట్టణంలోని స్థానిక మారెళ్ళ ఆటో స్టాండ్ నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు ప్రదర్శన చేసి అక్కడ రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు ,ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రాస్తారోకో కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి. కాసిం అధ్యక్షతన వహించారు. ఎ.రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం తీసుకురావడం వల్ల మహిళలకు ఉపయోగమున్నా ఆటో కార్మికుల ఉపాధి మాత్రం గల్లంతైందని ,కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిందన్నారు. అధికారం వచ్చిన వెంటనే ఆ వాగ్దానాన్ని మరిచారన్నారు. వెంటనే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ పెన్షన్ బ్యాంకు రుణాలు అందించాలన్నారు. ఆటో కార్మికుల కోసం ఆటో ఉన్న ప్రతి ఒక్కరికి రూ.25 వేలు సంవత్సరానికి భృతి కల్పించాలని, సమగ్ర చట్టాన్ని రూపొందించి వాహన మిత్ర అమలు చేయాలన్నారు. రవాణా చట్టం ద్వారా విపరీతమైన చలాన్లను విధించకూడదని అన్నారు. ఎటిసిని ఎత్తివేసి ఆటో కార్మికులకు కాలనీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్కడ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఆటో కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు మురుగన్, రాజశేఖర్, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి నరసన్న, డివైఎఫ్ఐ మండల నాయకులు డి.అల్లిపిర, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి మంజు, ఆటో కార్మిక సంఘం సభ్యులు మోహన్, వలి, చిట్టిబాబు, జగ్గు, రఘు, వినోద్, ఆచారి, రఘు, మునిస్వామి. తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండలో ఆటో కార్మికుల రాస్తారోకో



పోలీసు శాఖకు నూతన జాగిలం హంటర్

-పరిశీలించిన ఎస్‌పి విక్రాంత్ పాటిల్
-మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్ నుండి జిల్లా కు చేరుకున్న కొత్త డాగ్
-పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేసుల ఛేధనలో , నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం హంటర్ జిల్లా పోలీసు శాఖకు రావడం జరిగిందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. హంటర్ అనే నూతన జాగిలం ఎపి విజయవాడ మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6 వ బెటాలియన్ లో 10 నెలల పాటు పేలుడు పదార్థాలు గుర్తించడం లో శిక్షణ పొందిందన్నారు. ఈ సంధర్బంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన నూతన జాగిలాం హంటర్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డాగ్ స్క్వాడ్ మరింత సమర్ధవంతంగా విధులు నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ జాగిల%శీ%తో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య 9 కి చేరుకుందన్నారు. హంటర్ అనే జాగిలం బెల్జియం మలనాయిస్ జాతికి చెందినదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ జావేద్, డాగ్ స్వాడ్ ఇంచార్జ్ ఎఆర్ కానిస్టేబుల్ రాజు, డాగ్ హ్యాండ్లర్ ఎఆర్ కానిస్టేబుల్ శేఖర్ పాల్గొన్నారు.

పాలకొట్టాల వద్ద ఓపెన్ మ్యాన్‌హోల్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

లక్ష్మీ నగర్ పాలకొట్టాల వద్ద రోడ్డు మధ్యలో మాన్‌హోల్ నోరు తెరుచుకొని ఉంది. దీంతో వర్షం పడినప్పుడు రోడ్లపై నీరు నిలిచి రోడ్డుపై ఉన్న మ్యాన్ హోల్ కనిపించక అందులో పడి చిన్న పిల్లలు పెద్దవారు ప్రజలు గాయాలపాలయి ఆస్పత్రి పాలో అవుతున్నారు.కమిషనర్ వెంటనే స్పందించి నగరంలో ఎక్కడైతే మ్యాన్ హోల్ పై మూతలు లేకుండా ఉంటే పరిశీలించి ఆ మ్యాహోళ్లకు మూతలు వేయించాలని ప్రజలు కోరారు.



కల్వర్టు కొత్తగా నిర్మించాలి

కర్నూలు బస్టాండ్ దగ్గరలో ఉన్న మార్కెట్ యార్డ్ ఇన్ గేట్ వద్ద కల్వర్టు ఒకపక్క కూలిపోయింది. దీంతో మార్కెట్‌కు రైతులు పండించిన పంటలను వాహనాలతో తీసుకువచ్చే క్రమంలో ఆ గేటు ద్వారానే లోపలికి రావాల్సి ఉంటుంది. కల్వర్టు దెబ్బతిని ఉండడం చేత వాహనాల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా ఏమరపాటు గా అటుగా వెళితే గుంతలో పడికాళ్ళు చేతులు విరిగిపోయి ఆసుపత్రిలో చేరే పరిస్థితులు ఉన్నాయి. మార్కెట్ యార్డ్ కార్యదర్శి జయలక్ష్మి , మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ అజ్మత్‌బీ ఇద్దరూ కలిసి వెంటనే చొరవ తీసుకొని కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకొని కొత్త కల్వర్టు నిర్మాణం చేయాలని వ్యాపారులు, సిపిఎం నాయకులు టి .రాముడు బృందం కోరింది.

8న కలెక్టరేట్ లోగ్రీవెన్స్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈ నెల8న సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామనిజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని , ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

9 న జరిగే రైతు పోరు యాత్ర ను జయప్రదం చేయండి

వై సి పి పాణ్యం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు కల్లా వెంకట రమణ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రైతు సమస్యల పై ఈ నెల 9న నంద్యాలలో చేపట్టే రైతు పోరు యాత్ర ను జయప్రదం చేయాలని వైసిపి పాణ్యం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు కల్లా వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కల్లూరు అర్బన్ 26వ వార్డు వైసిపి కార్యాలయంలో మండల అధ్యక్షుడు వై రామకృష్ణ రెడ్డి అద్యక్షతన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు పోరు యాత్ర కరపత్రాలు విడుదల చేశారు. కె వి రమణ రెడ్డి, వై రామకృష్ణ రెడ్డి, జి కేశవరెడ్డి కె పి ఈశ్వరయ్య మాట్లాడారు

సాయి సుబ్బయ్య లో ఘనంగా టీచర్స్‌డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక మాధవి నగర్ లోని సాయి సుబ్బయ్య రవీంద్ర పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాటలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు మండలం కేంద్రంలో వెంకటగిరి గ్రామానికి చెందిన బోయగిరి ను అదే గ్రామానికి చెందిన పింజరి మౌలాలి, పింజరి హుస్సేన్ల మధ్య ఘర్షణ జరిగి దారుణ హత్యకు గురిఅయ్యాడు. మతుని అన్న మధు తెలిపిన వివరాల మేరకు... వెంకటగిరి గ్రామానికి చెందిన మద్దిలేటి, గిడ్డమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు మొదటి కుమారుడు మధు వెంకటగిరి గ్రామంలోని వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండవ కుమారుడు గిరి (28) జెసిబి డ్రైవర్గా కర్నూలులో పని చేస్తున్నాడు. ఆదివారం మాల పౌర్ణమి కావడంతో కర్నూలు నుంచి వెంకటగిరికి వెళ్లాడు. అక్కడ నుంచి వారి స్నేహితులైన మౌలాలి, హుస్సేన్‌తో పాటు కోడుమూరులోని రోడ్డులో గల రవీంద్ర వైన్‌షాప్ దగ్గర పర్మిట్ రూంలో మద్యం సేవిస్తూ మాట మాట పెరిగి మౌలాలి ఒకసారిగా కత్తితో గిరిని గొంతు కోశారు. బాధితుడు, నిందితులు ముగ్గురు కూడా అవివాహితులే. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

జిల్లా స్థాయి మారథాన్ పరుగు పోటీలను ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ,ఎయిడ్స్ నియంత్రణ,నివారణా విభాగం ,జిల్లా క్రీడా శాఖా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి మారథాన్ – 5 కి.మీ పరుగు పోటీలను ఇంచార్జీ జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ ప్రారంభించారు. ఈ పరుగు పోటీలు కోల్స్ కళాశాల నుండి పార్కు రోడ్, రాజ్ విహార్, కర్నూలు వైద్యా కళాశాల, సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్ పోస్టు వరకు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాల నుండి 58 విద్యార్థినిలు, 55 విద్యార్థులు, ఐదుగురు ట్రాన్సజండర్లు మొత్తం 118 మంది పాల్గొన్నారు. జిల్లా క్రిడా శాఖా అధికారి భూపతి రావు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్ మాట్లాడుతూ యువత అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువతలో హెచ్ఐవి, డ్రగ్స్ పట్ల అవగాహన కలిగించేందుకు ఉద్దేశించిన యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి మారథాన్ – 5 కి.మీ పరుగు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలల్లో గెలుపొందిన వారు పురుషులు విభాగంలో మొదటి విజేత బహుమతి టి. నాగ శ్రీనివాసులు రూ.10,000, రెండవ స్థానం సి.హరి కృష్ణ – బహుమతి రూ.7,000, మహిళా విభాగములో మొదటి విజేత మద్దూరు రేణుకా బహుమతి రూ.10,000, రెండవ స్థానం సి.దేవి రూ.7,000, బహుమతి ,ట్రాన్సజండర్లు విభాగములో మొదటి విజేత జి.లీలా ప్రసాద్ బహుమతి రూ.10,000, రెండవ స్థానం రక్షిత రూ.7,000 విజేతలకు బహుమతి ప్రశంశా పాత్రలను మెమెంటోలను ఇంచార్జీ డిఎంహెచ్ఒ హెచ్. డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా క్రీడా శాఖా అధికారి భూపతి రావు అందుకున్నారు. ఈ కార్యా క్రమంలో వైద్యా ఆరోగ్య శాఖా సిబ్బంది, ఎపి సాక్స్ ప్రోగ్రామ్ గణాంక అధికారి దేవి శంకర్ గౌడ, సిబ్బంది, జిల్లా క్రీడా శాఖా కోచ్‌లు, వివిధ కళాశాలల అధ్యాపకులు, స్వచ్ఛంద సమస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ, క్రీడాధికారి భూపతిరావు



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్

ముఖ్యంమత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పత్తికొండ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పత్తికొండ టిడిపిపి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని తొమ్మిది మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4,81,000 మంజూర్ అయిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో కుటుంబానికి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉంటున్నారని అన్నారు. చెక్కులను అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రామనాయుడు, తిమ్మయ చౌదరి,టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకునాథ్.మండల కన్వీనర్ కడవల సుధాకర్,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ లోగ్రాండ్ పేరెంట్స్ డే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



గ్రాండ్ పేరెంట్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కర్నూలు మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సంప్రదాయాలు రాబోవు తరాలకు తీపి గుర్తుగా తాతలు, ముత్తాతలు నిలుస్తారన్నారు. గ్రాండ్ పేరెంట్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భాహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్‌రాధ, తలిదండ్రులు పాల్గొన్నారు.